క్లుప్తంగా

సాయినాథుడికి ప్రత్యేక పూజలు



నాగాయలంక: స్థానిక షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం 150 మంది పేదలకు అన్నదానం చేశారు. గుజరాత్‌లో స్థిరపడిన దాసరి శ్రీనివాసరావు, గంగాభవాని దంపతులు తమ కుమార్తె జస్మిత వెంకట లహరి పుట్టినరోజు సందర్భంగా అన్నదానం జరిగింది. తొలుత ఆలయ అర్చకుడు పెద్దాడ శ్రీనివాసశాస్త్రి నేతృత్వంలో బాబాకు అభిషేకాలు, విశేష పూజలు జరిగాయి. మధ్యాహ్న హారతి అనంతరం పేదలు, దివ్యాంగులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త వర్రే సుమన్, మద్ది వెంకటేశ్వరరావు, రాచంశెట్టి పాపారావు, లేబాక నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంగానమ్మ సంబరం



గూడూరు: స్థానిక గంగానమ్మ సంబరం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొల్లు వారి వీధి నుంచి ప్రారంభమైన అమ్మవారి ఊరేగింపు కోలాహలంగా సాగింది. డీజే వాయిద్యాల నడుమ మేళతాళాలతో ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. అనంతరం గంగానమ్మ ఆలయం వద్ద అమ్మవారికి భక్తులు మొక్కుబడులు, నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గ్రామాభివృద్ధితోనే దేశాభ్యున్నతి



చల్లపల్లి: గ్రామాభివృద్ధితోనే దేశాభ్యున్నతి సాధ్యమని ఎంపీడీఓ చేకు చిన రాట్నాలు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జీపీడీపీ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పంచాయతీ స్థాయిలో అభివృద్ధి ప్రణాళిక రూపొందించుకుని గ్రామాలు పురోగతి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ కోట విజయ రాధిక, తహసీల్దార్ కె..గోపాలకృష్ణ, పీఆర్ ఏఈ బొప్పన శ్రీనివాసరావు, ఈఓఓఆర్డీ బూరేపల్లి అశోక్, సర్పంచ్‌లు, పంచాయతీ ఈఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి పీఏసీఎస్ సాయం



మాజేరు(చల్లపల్లి): రైతు కుటుంబానికి మాజేరు పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. చల్లపల్లి మండలం కొత్తమాజేరుకు చెందిన సొసైటీ సభ్య రైతు తమ్ము చంద్రరావు (60) ఇటీవల మరణించారు. సొసైటీ చైర్‌పర్సన్ అరజా శివశంకర్ సొసైటీ తరఫున రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని వారి కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ ఎస్ఎస్ చక్రపాణి, పర్సన్లు మోతుకూరి నాగమల్లేశ్వరరావు, పల్లి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పార్కులో వసతులపై ఆరా



మచిలీపట్నంటౌన్: నగరపాలక సంస్థ పార్కులో సందర్శకులకు ఇబ్బంది లేకుండా చూడాలని బందరు మేయర్ వెంకటేశ్వరమ్మ ఆదేశించారు. ఆమె గురువారం పార్కును పరిశీలించి వసతులపై ఆరా తీశారు. పార్కుకు వచ్చే సందర్శకులకు తాగునీరు ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేయాలని చెప్పారు. మేయర్ వెంట డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, డీఈ వరప్రసాద్ ఉన్నారు.

రేపు శ్రీరాముని శోభాయాత్ర

అవనిగడ్డ: అవనిగడ్డలో ఈ నెల 20వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు శ్రీరాముని శోభాయాత్ర ఏర్పాటు చేసినట్లు గీతామందిరం కమిటీ అధ్యక్షుడు యర్రంశెట్టి రాము తెలిపారు. అవనిగడ్డలో గురువారం ఆయన మాట్లాడుతూ అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ సమన్వయంతో స్థానిక శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి దేవస్థానం నుంచి వంతెన సెంటరు వరకు సాగుతుందని తెలిపారు. శ్రీరామ నామ కీర్తనతో మేళతాళాలతో జరిగే కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

అణగారిన వర్గాలకు కొండంత ధైర్యం

- అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి
- రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్



కోనేరుసెంటర్‌లో జరిగిన మారథాన్ ర్యాలీలో పాల్గొన్న ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్‌ప్రసాద్, జేసీ గీతాంజలి శర్మ తదితరులు

మచిలీపట్నంటౌన్: విజయవాడలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు అణగారిన వర్గాలకు కొండంత ధైర్యం ఇస్తోందని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్ చెప్పారు. విజయవాడ స్వరాజ్య మైదానంలోని స్మృతి వనంలో ఏర్పాటు చేసిన 206 అడుగుల ఎత్తైన భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గురువారం స్థానిక కోనేరు సెంటర్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు మారథాన్ ర్యాలీ నిర్వహించారు. దీన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని అంబేడ్కర్ భారీ విగ్రహాన్ని విజయవాడ నడిబొడ్డున ఏర్పాటు చేశారన్నారు. దీన్ని సామాజిక సమతా సంకల్పం కార్యక్రమంలో భాగంగా ఈ నెల 19వ తేదీ శుక్రవారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించనున్నారన్నారు. ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో సభ జరుగుతుందని తెలిపారు.

ప్రజలను కాపాడే మహాశక్తి అంబేడ్కర్

రాజ్యాంగ హక్కుల ద్వారా నిరంతరం ప్రజలను కాపాడే మహాశక్తి అంబేడ్కర్ అన్నారు. కులమతాలకు అతీతంగా పేదల జీవితాల్లో అంబేడ్కర్ వెలుగులు నింపారన్నారు. ప్రతి వాడలో అంబేడ్కర్ విగ్రహం అణగారిన వర్గాలకు కొండంత భరోసా ఇస్తోందని చెప్పారు. విజయవాడలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహం రాష్ట్రానికే కాకుండా దేశానికే తలమానికమని వివరించారు. 18.81 ఎకరాల విస్తీర్ణంలో రూ.400 కోట్లతో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ విగ్రహాన్ని ఈక్వాలిటీ ఆఫ్ లిబర్టీగా ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. విగ్రహ పెడస్టల్ ఎత్తు 81 అడుగులు, విగ్రహం 125 అడుగులు కలిపి 206 అడుగుల ఎత్తులో ఠీవిగా కనపడుతోందని చెప్పారు. అంబేడ్కర్ జీవిత చరిత్రను భావితరాలకు అందించడానికి అద్భుతమైన కళాఖండాన్ని అంబేడ్కర్ స్మృతివనంగా తీర్చిదిద్దారన్నారు. విగ్రహం ఏర్పాటుతో విజయవాడ ప్రజాదరణ పొందిన గొప్ప పర్యాటక కేంద్రంగా మారబోతోందని చెప్పారు. కార్యక్రమంలో జేసీ గీతాంజలి శర్మ, సోషల్ వెల్ఫేర్ డీడీ షేక్ షాహిద్‌బాబు, మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, కమిషనర్ చంద్రయ్య, డీఆర్డీఏ పీడీ పీఎస్ఆర్ ప్రసాద్, డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, కేడీసీసీబీ డైరెక్టర్ గడిదేశి బాలజేసు, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్ దాదా, కో-ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జక్కుల ఆనందబాబు, దళిత జేఏసీ నాయకులు బూరగ రామారావు, ప్రత్తిపాటి ప్రేమ్‌కుమార్, తప్పెట రాజు, దార్ల చెన్నకేశవరావు, గంధ్రపు శీనయ్య మాస్టర్, అరిసె శ్రీహరి తదితరులు పాల్గొన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి విక్టర్‌ప్రసాద్, జేసీ గీతాంజలి శర్మ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గరికపర్రుకు చెందిన రాజీవ్ డప్పుల బృందం కళాకారులు డప్పులు కొడుతూ చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

- విజయవాడ స్వరాజ్య మైదానంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఉపాధ్యాయులు హాజరు కావాలని వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఎంవీ మహంకాళిరావు గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. పాఠశాలలకు సెలవు కావడంతో ఉపాధ్యాయులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

కోడూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విజయవాడలో నిర్మించిన రాజ్యాంగ నిర్మాతడాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ప్రజలందరూ తరలిరావాలని ఆ పార్టీ నేతలు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో నేతలు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభిస్తారని పార్టీ జిల్లా ఎస్సీసెల్ కన్వీనర్ గుర్రం బసవయ్య తెలిపారు. సామాజిక న్యాయం దిశగా అడుగులు వేస్తూ అంబేడ్కర్ చేసిన సేవలకు గుర్తుగా ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. అనంతరం పార్టీ నేతలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, ఎంపీటీసీలు బడే గంగాధరరావు, ముక్కు వెంకటేశ్వరరావు, ఎస్సీసెల్, ఈసీ సంఘం మండల కన్వీనర్లు వెన్నా ప్రసాద్, లంకే రవి, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణకు అందరూ ఆహ్వానితులే

పేర్ని వెంకట్రామయ్య (నాని)



చిలకలపూడి(మచిలీపట్నం): విజయవాడ స్వరాజ్య మైదానంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణకు అందరూ ఆహ్వానితులేనని మాజీ మంత్రి, బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా జరగనున్న ఈ కార్యక్రమానికి జిల్లా ప్రజలు తరలిరావాలన్నారు. బడుగు, బలహీనవర్గాల వారు, అంబేడ్కర్ అభిమానులు హాజరై కనుల పండువగా నిర్వహించే కార్యక్రమాన్ని వీక్షించాలన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే

మచిలీపట్నంటౌన్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం. భాస్కరరావు గురువారం తెలిపారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు మాచవరం, దేవునిచెరువు, పెడన బైపాస్ రోడ్డు, వలందపాలెం, జెడ్పీ సెంటర్, పట్టాభిపురం, గంగులతోట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

త్వరలో యోగ శిక్షణ తరగతులు

యార్లగడ్డ(చల్లపల్లి): ఏపీ - ఆయుష్ శాఖ సహకారంతో త్వరలో యోగ శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్లు చల్లపల్లి మండల హోమియో వైద్యాధికారి డాక్టర్ డి.రవినాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.యార్లగడ్డ హోమియో వైద్యశాలలో పురుష ట్రైనర్, మహిళా ట్రైనర్‌ను నియమించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు ఆసుపత్రిలో సంప్రదించాలని సూచించారు.

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

గూడూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ డి.సుబ్బారావు తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ సంగా మధుసూదనరావు అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులతో పాటు సర్పంచులు హాజరవుతారన్నారు. వివిధ శాఖల మండల స్థాయి అధికారులు సమగ్ర సమాచారంతో రావాలని కోరారు.

ప్రభుత్వ పథకాలతో జీవన ప్రమాణాలు పెంపు

కృత్తివెన్ను: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ప్రభుత్వ పథకాలను వినియోగించుకుని జీవన ప్రమాణాలను మరింత మెరుగుపరుచుకోవాలని వికసిత భారత సంకల్పయాత్రలో బృంద ప్రతినిధులు తెలిపారు. మండల పరిధిలోని నీలిపూడి, మునిపెడ గ్రామ పంచాయతీల్లో గురువారం వికసిత భారత్ యాత్ర గ్రామ సభలు నిర్వహించారు. దీనిలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తున్న పథకాలను వివరిస్తూ వాటితో కలిగే ప్రయోజనాలను ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో ప్రచార వాహన కో ఆర్డినేటర్లు, ఎంపీడీవో పిచ్చిబాబు, నీలిపూడి సర్పంచ్ పాశం కృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు పిన్నెంటి సతీష్, పాశం రాము, పంచాయతీ కార్యదర్శి ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

22న కోడూరులో ఆధ్యాత్మిక కార్యక్రమాలు

కోడూరు: అయోధ్యలో శ్రీరామమందిర ఆలయ ప్రతిష్ఠను పురస్కరించుకొని ఈ నెల 22న కోడూరులో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వీహెచ్‌పీ నియోజకవర్గ ప్రముఖ్ పూతబోయిన వెంకటసుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక దానాశక్తి ఆర్యవైశ్య ప్రార్థనా మందిరంలో గురువారం పరిషత్ ప్రతినిధులు విలేకర్లతో మాట్లాడారు. 22న ఉదయం కోడూరు అన్నం కిషోర్ రైస్‌మిల్ ప్రాంగణంలో విష్ణు సహస్ర నామ పారాయణం, శ్రీరామచంద్రుల చిత్రపటాల ఊరేగింపు ఉంటుందన్నారు. రామమందిర ప్రతిష్ఠ ప్రజలు తిలకించడానికి భారీ ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం 10 వేల మందికి అన్న సమారాధన జరుగుతుందని వెంకట సుబ్రహ్మణ్యం తెలిపారు. హిందూ పరిషత్ సభ్యులు అన్నం యోగానంద్, కాశీభొట్ల సాయి, అన్నం శివరామకృష్ణ, జరుగు సాంబశివరావు, బండే ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా



కబడ్డీ ఆడుతున్న మహిళా జట్టు



బ్యాడ్మింటన్ ఆడుతున్న దృశ్యం

మచిలీపట్నంటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా గురువారం నగరంలో క్రీడాకారులు పలు ఆటల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రికెట్ మ్యాచ్‌తో పాటు నాలుగు మహిళా వాలీబాల్ మ్యాచ్‌లు, నాలుగు మహిళ కబడ్డీ మ్యాచ్‌లు, 32 పురుషుల బ్యాడ్మింటన్, 20 మహిళల బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. పోటీలను చిలకలపూడి పాండురంగ మునిసిపల్ ఉన్నత పాఠశాల పీఈటీ రమేష్‌కుమార్ పర్యవేక్షించారు.

నాగాయలంక: ఆడుదాం ఆంధ్రా టోర్నమెంట్‌లో రెండో రోజు గురువారం మండల స్థాయిలో క్రికెట్ జట్ల మధ్య జోరుగా పోటీలు సాగాయి. నాగాయలంక జెడ్పీ ఉన్నత పాఠశాల ప్లస్ గ్రౌండ్స్‌లో ఆరు జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. తొలుత పోటీలను ఎంపీడీఓ చతుర్వేదుల శ్రీనివాస్ ప్రారంభించారు. మండల స్థాయికి చేరిన 23 క్రికెట్ జట్లు పోటీలో తలపడుతున్నాయి. వీటిలో ఏడు మహిళా జట్లు కూడా ఉన్నాయి. వ్యాయామ ఉపాధ్యాయులు గాజుల లక్ష్మీప్రసాద్, కోసూరు పూర్ణచంద్రరావు, సీహెచ్ సుబ్బారావు పోటీలు నిర్వహిస్తున్నారు.

గూడూరు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆటస్థలంలో జరుగుతున్న క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. గురువారం జరిగిన మండల స్థాయి లీగ్ పోటీల్లో కప్పలదొడ్డి జట్టుతో తలపడిన ఆకులమన్నాడు జట్టు విజయం సాధించింది. కంకటావ జట్టుతో తలపడిన కంచాకోడూరు జట్టు గెలుపొందగా, తరకటూరు జట్టుతో తలపడిన మల్లవోలు-2 జట్టు జయకేతనం ఎగురవేశాయి. శుక్రవారం లీగ్ పోటీలు కొనసాగుతాయని ఎంపీడీఓ డి.సుబ్బారావు వెల్లడించారు. పీడీలు మురళీకృష్ణ, మత్తి అరుణ పర్యవేక్షించారు.

కృత్తివెన్ను: ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు కృత్తివెన్ను మండలంలో మండల స్థాయిలో జరుగుతున్నాయి. గురువారం పలు గ్రామాల మధ్య క్రికెట్ పోటీలు నిర్వహించారు. మూడు రోజులు పోటీలు జరుగుతాయని ఎంపీడీవో పిచ్చిబాబు తెలిపారు. శనివారం గెలుపొందిన జట్ల మధ్య ఫైనల్స్ జరుగుతాయని, దీనిలో గెలిచిన జట్టు నియోజకవర్గ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటుదని ఆయన పేర్కొన్నారు.

ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించండి

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజాబాబు



మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు చిత్రంలో డీఆర్వో పెద్ది రోజా

చిలకలపూడి(మచిలీపట్నం): జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజాబాబు అధికారులకు సూచించారు. ఆయన గురువారం రాత్రి జిల్లాలోని ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జాతీయ ఓటర్ల దినోత్సవ నిర్వహణ, రాబోయే ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు తదితర అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఓటర్లను చైతన్యవంతం చేయడానికి పెద్ద ఎత్తున ర్యాలీలు, మానవహారాలు నిర్వహించాలన్నారు. యువ ఓటర్లు, వృద్ధ ఓటర్లను సత్కరించాలన్నారు. పాఠశాల, కళాశాల విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలని చెప్పారు. ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచే విధంగా ప్రజలకు అవగాహన కలిగించేలా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పోలింగ్ కేంద్రాలు అన్నింటిలో ఫర్నిచర్, ర్యాంప్‌లు, టాయిలెట్లు, విద్యుత్ సౌకర్యం, మౌలిక వసతులు కల్పించాలన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ స్టేషన్‌ను డివిజన్ కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. వీసీలో డీఆర్వో పెద్ది రోజా పాల్గొన్నారు.

ముగిసిన గ్రామోత్సవం



వైభవంగా అమ్మవారి గ్రామోత్సవం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా జరుగుతున్న అమ్మవారి గ్రామోత్సవం గురువారం అర్ధరాత్రి తర్వాత ముగిసింది. ఐదు రోజులుగా రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామాల్లో గ్రామోత్సవం వైభవంగా జరుతోంది. పలు గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారి ఉత్సవ వాహనాన్ని అనుసరిస్తూ మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ బోయిన భానుప్రదీప్, ఆలయ ఈఓ పి.లోకేశ్వరి మాట్లాడుతూ గత ఐదు రోజుల నుంచి అమ్మవారి గ్రామోత్సవం అత్యంత వైభవంగా జరుగుతోందన్నారు. ఉత్సవాల్లో అమ్మవార్లకు హుండీల్లో సమర్పించిన ఆదాయాన్ని శుక్రవారం లెక్కిస్తామని పేర్కొన్నారు. ఉత్సవాలు ముగింపు సందర్భంగా 20న ఆలయంలో భారీ అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు.

క్రీస్తు బోధనలు అనుసరించాలి



ప్రసంగిస్తున్న దైవజనులు క్రీస్తు రాయబారి, పక్కన లూథియానా

అడ్డాడ(పామర్రు): ఏసుక్రీస్తు చూపిన సేవా మార్గంలో ప్రతి ఒక్కరూ పయనిస్తూ ఆయన బోధనలను అనుసరించాలని దైవజనులు క్రీస్తు రాయబారి పేర్కొన్నారు. మండల పరిధిలోని అడ్డాడ గ్రామంలో సిలువ మిషన్ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న సిలువ పండుగ కార్యక్రమాలు గురువారంతో ముగిశాయి. కార్యక్రమానికి హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, తెలంగాణ రాష్ట్రాలతో పాటు గుంటూరు, విశాఖపట్నం ,విజయనగరం తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో క్రీస్తు విశ్వాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీస్తు రాయబారి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ శాంతి, క్షమ, దయ గుణాలను కలిగి ఉంటూ సమాజంలో శాంతి స్థాపనకు కృషి చేయాలన్నారు. ప్రభువైన క్రీస్తు బోధనలను అనుసరిస్తూ తన వలే తన పొరుగు వారిని ప్రేమించాలని సూచించారు. దైవజనురాలు లూథియానా మాట్లాడుతూ ఎంతో మంది విశ్వాసులకు ప్రభువు సాక్ష్యాలను ఇచ్చి వారిని ఆదుకున్నారన్నారు. ఈ సందర్భంగా ఆలపించిన భక్తి పాటలు విశ్వాసులను ఆనందపరిచాయి. కార్యక్రమంలో పాస్టర్లు ప్రభు, మిల్కిషదక్(రామకృష్ణ), అకుల్లా(ప్రసాద్), సత్యం, విజయ్‌శేఖర్, అబ్రహాం, క్రీస్తు విశ్వాసులు పాల్గొన్నారు.

పలువురి అర్చకులకు దుస్తుల పంపిణీ

తోట్లవల్లూరు: పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆధ్వర్యాన అర్చకులకు నూతన వస్త్రాల పంపిణీ గురువారం జరిగింది. తోట్లవల్లూరులోని శ్రీభ్రమరాంబ చెన్నమల్లికార్జునస్వామి ఆలయం, శ్రీరుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంతో పాటు స్థానికంగా ఉన్న పలు ఆలయాల అర్చకులకు వైఎస్సార్ సీపీ నాయకులు నూతన వస్త్రాలు, స్వీట్లు పంపిణీ చేశారు. పీఏసీఎస్ అధ్యక్షుడు పడమట హరి ప్రసాద్, సచివాలయ కన్వీనర్ కిలారం రామకృష్ణ, కన్స్యూమర్ సొసైటీ చైర్మన్ రావులపల్లి శ్రీనివాస్, నాయకులు గోనేపల్లి శ్రీనివాసరావు, లంక శ్రీనివాసరావు, ఆసిఫ్, బుడే, లల్లూ, గణేష్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సాల్మన్ తదితరులు

పామర్రు: స్థానిక చాట్లవానిపురంలోని విజన్ లైఫ్ సెంటర్‌లో నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఏపీ క్రైస్తవ సంక్షేమ సంఘ అధ్యక్షుడు సాల్మన్ కొల్లాబత్తుల గురువారం ఆవిష్కరించారు. సమాజ సేవలో దైవ సేవకుల పాత్ర అనే డిబేట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజ సేవలో దైవ సేవకులు కీలక పాత్ర పోషించాలన్నారు. అనేక మందిని సన్మార్గులుగా మారుస్తూ మంచి మార్గంలో నడిపిస్తున్నారని చెప్పారు. అనేక సేవా కార్యక్రమాల్లో దైవ సేవకులు పాల్గొంటున్నారన్నారు. ప్రతి ఒక్కరూ శాంతి, క్షమ గుణాలు కల్గి ఉండేలా బోధనలు చేయాలని సూచించారు. ప్రభువు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించేలా బోధనలు చేయాలన్నారు. కార్యక్రమంలో టి.సాలెం రాజు, వై.సంగీతరావు, ఎస్.శామ్యూల్, జి.సత్యకుమార్, సాగర్, వరప్రసాదరావు పాల్గొన్నారు.

నేటి నుంచి కులగణన ప్రారంభం

చల్లపల్లి: కలెక్టర్ ఆదేశాల మేరకు చల్లపల్లి మండలంలో శుక్రవారం నుంచి కులగణన ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ చేకు చిన రాట్నాలు తెలిపారు. మండలంలోని 15 గ్రామ సచివాలయాల పరిధిలో కుల గణన ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సిబ్బంది కుల గణన చేస్తారని, ప్రజలు సహకరించాలని కోరారు.

బస్సులో ఆభరణాల చోరీపై కేసు నమోదు

పెనమలూరు: బస్సులో ప్రయాణిస్తున్న మహిళ హ్యాండ్ బ్యాగ్‌లో ఆభరణాలు చోరీ జరగడంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల మేరకు చల్లపల్లి మండలం వెలువోలు గ్రామానికి చెందిన తోడేటి ప్రియదర్శిని ఈ నెల 11వ తేదీన విజయవాడ బస్‌స్టాండ్‌లో కరకట్టపై వెళ్లే అవనిగడ్డ బస్సు ఎక్కింది. బస్సు పెదపులిపాక గ్రామం వద్దకు వచ్చిన సమయంలో బస్ టికెట్ కొనడానికి ఆమె వద్ద ఉన్న హ్యాండ్‌బ్యాగ్ చూడగా బ్యాగ్ జిప్ తెరిచి ఉంది. బ్యాగ్‌లో ఉన్న బంగారు ఆభరణాలు కనిపించలేదు. గుర్తు తెలియని వ్యక్తులు హ్యాండ్ బ్యాగ్‌లోని ఆభరణాలు చోరీ చేశారని బాధితురాలు ఆలస్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

యువతి అదృశ్యం

పెనమలూరు: తాడిగడపకు చెందిన యువతి అదృశ్యం అవ్వడంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప గంగానమ్మగుడికి చెందిన పి.వెంకటరామకృష్ణారావుకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. అతని కుమార్తె(21) ఎంబీఏ చదువుతుంది. కాగా ఈ నెల 16వ తేదీన ప్రాజెక్ట్ మెటీరియల్ తెచ్చుకుంటానని విజయవాడ బెంజిసర్కిల్‌కు వెళ్లింది. రాత్రి అయినా ఆమె తిరిగి రాలేదు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వస్తుంది. దీంతో కుటుంబ సభ్యులు ఆమె కోసం వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైద్య సేవలు అందుబాటులో ఉండాలి

ముదినేపల్లిరూరల్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యసేవలు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. మండలంలోని ముదినేపల్లి, గురజ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధి కమిటీల సమావేశాలు గురువారం జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలపై ప్రజలకు విశ్వాసం పెరిగే విధంగా వైద్యులు, సిబ్బంది సేవలందించాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించబోమన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ వ్యాధులకు మందులు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు.